TGTEL/25/A4812
వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక
సంపుటి : 01| సంచిక : 34 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ బుధవారం | మే 13, 2026

## ఫ్యూచర్ సిటీకి 'ఉబర్' కళ..



- హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆఫీస్, ఎక్సలెన్స్ సెంటర్ విస్తరణ
- సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయిన ఉబర్ సీఈవో దారా ఖోస్రోషాహి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణలో పెట్టుబడులకు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు క్యూ కడుతున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత రవాణా సేవల సంస్థ 'ఉబర్' హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను భారీగా విస్తరించాలని నిర్ణయించింది. బుధవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఉబర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి, సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో ఉబర్ విస్తరణ, నూతన ప్రాజెక్టులపై కీలక చర్చలు జరిగాయి. అమెరికా వెలుపల ఉబర్ ఏర్పాటు చేసిన మొట్టమొదటి ఎక్సలెన్స్ సెంటర్ హైదరాబాద్‌లోనే ఉందని, ప్రస్తుతం ఇందులో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో తెలిపారు. దీనిని మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'ఫ్యూచర్ సిటీ'లో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈవో ఆసక్తి కనబరిచారు. నగరాల్లో ప్రధాన సమస్యగా మారిన పార్కింగ్‌పై సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. ఉబర్ సంస్థ 'పార్కింగ్ వ్యాపారం'లోకి రావాలని, మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్ల ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు. దీనిపై సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వ్యాపార విస్తరణకు, పెట్టుబడులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని సీఎం ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, సీటీఓ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.




## తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ 'వెట్రి'

- 144 ఓట్లతో విశ్వాస పరీక్షలో విజయం
- బహిష్కరించిన డీఎంకే..
- మద్దతుగా నిలిచిన అన్నాడీఎంకే రెబల్ వర్గం

**చెన్నై, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. అసెంబ్లీలో బుధవారం జరిగిన హైడ్రామా మధ్య ముఖ్యమంత్రి విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. విశ్వాస పరీక్షలో అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా 144 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయగా, వ్యతిరేకంగా కేవలం 22 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఐదుగురు సభ్యులు తటస్థంగా ఉన్నారు. మ్యాజిక్ ఫిగర్‌ను సులువుగా అందుకున్న విజయ్ ప్రభుత్వానికి కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు (సీపీఐ, సీపీఎం), వీసీకే, ఐయూఎంఎల్ ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు . డీఎంకేకు చెందిన 59 మంది ఎమ్మెల్యేలు సభను బహిష్కరించి బయటకు వెళ్లడంతో సభలో సభ్యుల సంఖ్య తగ్గి, విజయ్ గెలుపు మరింత సులువైంది. అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి వ్యతిరేకించినప్పటికీ, ఆ పార్టీకి చెందిన రెబల్ వర్గం నేత వేలుమణి ఆధ్వర్యంలోని ఎమ్మెల్యేలు విజయ్‌కు అనుకూలంగా ఓటు వేయడం గమనార్హం. ( మిగతాది రెండో పేజీలో.. )

### పోలీసుల విచారణకు
## బండి భగీరథ్ గైర్హాజరు

- పోక్సో కేసులో పెరిగిన సెక్షన్లు..
- నేడు హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ బుధవారం పోలీసుల విచారణకు హాజరుకాలేదు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన పోక్సో కేసులో విచారణ నిమిత్తం మధ్యాహ్నం 2 గంటలకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ముందు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆయన గైర్హాజరయ్యారు. ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తున్న పోలీసులు విచారణలో భాగంగా ఎఫ్ఐఆర్ లో మరిన్ని కఠినమైన సెక్షన్లను చేర్చారు. బాధితురాలి నుంచి పోలీసులు రెండోసారి వాంగ్మూలాన్ని సేకరించారు. ముందుగా ప్లాన్ చేసి లైంగిక దాడికి పాల్పడినట్లు నిర్ధారిస్తూ, నిందితుడిపై సెక్షన్ 5 (L)ను అదనంగా చేర్చారు. దీంతో ఈ కేసు మరింత క్లిష్టంగా మారింది. పోలీసులు విచారణ వేగవంతం చేసిన నేపథ్యంలో, అరెస్టు నుంచి తప్పించుకునేందుకు బండి భగీరథ్ తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. గురువారం ఈ పిటిషన్‌పై హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరపనుంది. విచారణకు హాజరుకాకపోవడంపై పోలీసులు తదుపరి చర్యలు ఎలా తీసుకోబోతున్నారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.




## పుదుచ్చేరి సీఎంగా రంగస్వామి ప్రమాణ స్వీకారం

- సీఎంగా ఐదోసారి రంగస్వామి 'ముద్ర'..
- సింగపూర్‌లా మారుస్తానని ప్రకటన
- కేబినెట్ మంత్రులుగా నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు ప్రమాణం




### ఎయిర్ ఇండియా
## సంచలన నిర్ణయం

- ఆరు దేశాలకు విమాన సర్వీసులు నిలిపివేత
- జూన్ నుంచి ఆగస్టు వరకు తాత్కాలిక రద్దు
- నష్టాల నియంత్రణకే ఈ చర్య!

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
బుధవారం, మే 13, 2026

## విపక్షనేతలంటే లెక్కలేదా ?

### మోడీ తీరుపై మండిపడ్డ వీహెచ్



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు తీవ్రంగా విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీబీఐ డైరెక్టర్ వంటి కీలక పదవుల నియామకంలో ప్రతిపక్ష నేత అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, కానీ మోదీ ప్రభుత్వం అపోజిషన్ లీడర్‌ను కేవలం రబ్బర్ స్టాంప్‌లా భావిస్తోందని మండిపడ్డారు. దీనిపై ప్రధానికి రాహుల్ గాంధీ లేఖ రాయడాన్ని ఆయన అభినందించారు. తనకు అనుకూలంగా ఉండి, భజన చేసే వారికే మోదీ కీలక పదవులు కట్టబెడుతున్నారని వీహెచ్ ఆరోపించారు. ఈ విషయంలో రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్‌ను, ఆయన రచించిన రాజ్యాంగాన్ని అవమానిస్తోందని, ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో మోదీ కీలుబొమ్మగా మారారని దుయ్యబట్టారు. దేశవ్యాప్త జనగణనలో బీసీ కాలమ్ లేకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. 'సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్' అనేది కేవలం ఒక అబద్ధమని, దేశంలో జరుగుతోంది కేవలం 'బీజేపీ వికాసం' మాత్రమేనని వీహెచ్ ఎద్దేవా చేశారు.

# తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ 'వెట్రి'

- 144 ఓట్లతో విశ్వాస పరీక్షలో విజయం
- బహిష్కరించిన డీఎంకే..
- మద్దతుగా నిలిచిన అన్నాడీఎంకే రెబల్ వర్గం

**చెన్నై, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. అసెంబ్లీలో బుధవారం జరిగిన హైడ్రామా మధ్య ముఖ్యమంత్రి విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. విశ్వాస పరీక్షలో అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా 144 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయగా, వ్యతిరేకంగా కేవలం 22 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఐదుగురు సభ్యులు తటస్థంగా ఉన్నారు. మ్యాజిక్ ఫిగర్‌ను సులువుగా అందుకున్న విజయ్ ప్రభుత్వానికి కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు (సీపీఐ, సీపీఎం), వీసీకే, ఐయూఎంఎల్ ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు . డీఎంకేకు చెందిన 59 మంది ఎమ్మెల్యేలు సభను బహిష్కరించి బయటకు వెళ్లడంతో సభలో సభ్యుల సంఖ్య తగ్గి, విజయ్ గెలుపు మరింత సులువైంది. అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి వ్యతిరేకించినప్పటికీ, ఆ పార్టీకి చెందిన రెబల్ వర్గం నేత వేలుమణి ఆధ్వర్యంలోని ఎమ్మెల్యేలు విజయ్‌కు అనుకూలంగా ఓటు వేయడం గమనార్హం.

- ఇది 'రీల్' ప్రభుత్వం కాదు.. 'రియల్' ప్రభుత్వం: సీఎం విజయ్

విశ్వాస పరీక్షలో నెగ్గిన అనంతరం సీఎం విజయ్ మాట్లాడుతూ విపక్షాల విమర్శలకు ఘాటుగా సమాధానమిచ్చారు. "మేము ప్రజలను నమ్ముకుని ఎన్నికల బరిలోకి దిగాం. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం మాకు లేదు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు సామాజిక న్యాయం, లౌకిక వాదంతో ముందుకు సాగుతుంది. గత ప్రభుత్వం చేపట్టిన మంచి పథకాలను కొనసాగిస్తూనే, మహిళల భద్రతకు పెద్దపీట వేస్తాం." డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ, ఇది 'రీల్' ప్రభుత్వమని, ఎమ్మెల్యేల కొనుగోళ్లతోనే విజయ్ గట్టెక్కారని ఆరోపించారు. రాష్ట్ర ప్రతిష్టను విజయ్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని మండిపడ్డారు. తమ పార్టీ ఎమ్మెల్యేలకు విజయ్ డబ్బులు ఆఫర్ చేశారని అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి సంచలన ఆరోపణలు చేశారు. అయితే, తాము ఎలాంటి పదవులను ఆశించి మద్దతు ఇవ్వడం లేదని రెబల్ వర్గం స్పష్టం చేసింది. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాలు గెలుచుకోగా, ఇతర మిత్రపక్షాల మద్దతుతో 144 మార్కును చేరుకుని అధికారాన్ని సుస్థిరం చేసుకుంది. ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలను పునఃసమీక్షిస్తామని కూడా సీఎం ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# పుదుచ్చేరి సీఎంగా రంగస్వామి ప్రమాణ స్వీకారం

- సీఎంగా ఐదోసారి రంగస్వామి 'ముద్ర'..
- సింగపూర్‌లా మారుస్తానని ప్రకటన
- కేబినెట్ మంత్రులుగా నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు ప్రమాణం



**పుదుచ్చేరి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రంగస్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక లోక్ భవన్‌లో జరిగిన వేడుకలో లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. రంగస్వామితో పాటు నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ విజయంతో పుదుచ్చేరిలో ఐదోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన నేతగా రంగస్వామి అరుదైన రికార్డును నెలకొల్పారు. ప్రమాణ స్వీకారం అనంతరం సీఎం రంగస్వామి విలేకరులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని జోడు గుర్రాలుగా ముందుకు తీసుకెళ్తుందని, ప్రజల జీవన ప్రమాణాలను పెంచే పథకాలకు పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిని అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రంగా మార్చడమే కాకుండా, సింగపూర్ తరహాలో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. పుదుచ్చేరిలో ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. "అనుభవజ్ఞుడైన, సమర్థవంతమైన పరిపాలకుడైన రంగస్వామికి అభినందనలు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన మంత్రులు పుదుచ్చేరి పురోగతికి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తారని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు. 30 స్థానాలున్న పుదుచ్చేరి అసెంబ్లీలో ఎన్డీయే కూటమి స్పష్టమైన మెజారిటీని సాధించింది. ఏఐఎన్ఆర్‌సీ : 12 స్థానాలు, బీజేపీ: 04 స్థానాలు, ఏఐఏడీఎంకే అండ్ ఎల్జేకే: చెరో స్థానం, ఇతరులు: డీఎంకే 05, కాంగ్రెస్ 01, తమిళగ వెట్రి కళగం (టీవీకే) 02 స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సహా పలువురు సీనియర్ నాయకులు, మిత్రపక్షాల ప్రతినిధులు పాల్గొన్నారు.




## మాజీ సర్పంచ్ ని పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి



**దామెర, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పరకాల నియోజకవర్గంలోని దామెర మండలం ఊరుగొండ గ్రామ మాజీ సర్పంచ్ గోగుల సత్యనారాయణ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన ఒక ప్రమాదంలో సత్యనారాయణ రెడ్డి గాయపడి, ప్రస్తుతం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న చల్లా ధర్మారెడ్డి నేరుగా ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన తీరును, ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స వివరాలను కుటుంబ సభ్యులను అడిగారు. సత్యనారాయణ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శలో దామెర మండల ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల పార్టీ నాయకులు, యువజన నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనగణన ప్రక్రియను పక్కాగా నిర్వహించాలి



**దామెర, వాయిస్ ఆఫ్ వందే భారత్ : :** మండలంలోని పులుకుర్తి, సింగరాజుపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న మొదటి విడత జనగణన–2027ను పరకాల ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న సర్వే తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న తీరును ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. దేశ భవిష్యత్తు ప్రణాళికలకు జనగణన ఎంతో కీలకమని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ సెన్సెస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దామెర తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, జీపీఓ మురళి, సంబంధిత ఎన్యూమరేటర్లు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
బుధవారం, మే 13, 2026

# ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

▪ ప్రతిభావంతులైన విద్యార్థులకు ఘన సన్మానం



**అమ్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ ఫలితాల్లో అత్యుత్తమ సీజీపీఏ సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కే. గోపాల్ అధ్యక్షతన, గ్రామ సర్పంచ్ సి. కోటయ్య శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కే.గోపాల్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు కేవలం ఉత్తీర్ణతతో ఆగిపోకుండా, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమై ప్రభుత్వ లేదా ప్రైవేటు రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. అలాగే, ఇంటర్ పూర్తి చేసిన తమ చుట్టుపక్కల విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేలా ప్రోత్సహించి, అడ్మిషన్ల పెంపునకు కృషి చేయాలని సన్మాన గ్రహీతలను కోరారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ సి. కోటయ్య మాట్లాడుతూ.. అమ్రాబాద్ మండలంలోని విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఈ కళాశాలనే ఎంచుకునేలా గ్రామ సభల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. కళాశాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు గ్రామ పంచాయతీ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇస్తూ, ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. ఈ వేడుకలో కళాశాల అధ్యాపక బృందం డాక్టర్ కే.రాధ, ఏ.చంద్రయ్య, జీ.ఆంజనేయులు, ఎన్.మల్లయ్య, ఏ.సుష్మ, అధ్యాపకేతర సిబ్బంది ఎండీ.యూనిస్, ఎం.రామకృష్ణ, సీ.రాఘవేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 16న 'డాన్సింగ్ స్టార్స్ - 2026' ఫెస్ట్




**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కళలను ప్రోత్సహించడంతో పాటు సామాజిక సేవను లక్ష్యంగా పెట్టుకుని 'వన్స్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ డెవలప్మెంట్ ట్రస్ట్' ఆధ్వర్యంలో మే 16న హనుమకొండలోని కళోజీ కళాక్షేత్రంలో "డాన్సింగ్ స్టార్స్ - 2026" స్టేట్ లెవల్ కల్చరల్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ మరియు ప్రెసిడెంట్ గాదె శ్రావణ్ కుమార్ తెలిపారు. బుధవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. కళాకారుల్లోని ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఒక ఉత్తమమైన వేదికను కల్పించడమే తమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చే నిధులను అంధులు, అనాథలు మరియు వృద్ధుల సహాయార్థం వెచ్చించనున్నట్లు తెలిపారు. గతంలో కూడా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, ప్రముఖ కొరియోగ్రాఫర్లు శేఖర్ మాస్టర్, యశ్వంత్ మాస్టర్లను వరంగల్‌కు తీసుకువచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈసారి జరగబోయే ఈవెంట్‌లో ఫోక్ సాంగ్స్, వెరైటీ స్టెప్స్‌తో అలరించేందుకు ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డాన్స్ టాలెంట్‌ను ఈ వేదికపై చూడవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ సాంస్కృతిక వేడుకకు ముఖ్య అతిథులుగా వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామి రెడ్డిలు హాజరుకానున్నారని శ్రావణ్ కుమార్ వెల్లడించారు. ఈ స్టేట్ లెవల్ కాంపిటీషన్‌లో పాల్గొనదలచిన వారు లేదా పూర్తి వివరాలు తెలుసుకోవాలనుకునే వారు 9908743178, 9014013179 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సందీప్ కుమార్, డాన్స్ మాస్టర్ జితేందర్ భరద్వాజ్, మను వర్మ, జి.దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పలపల్లిలో జనాభా గణన ప్రారంభం

▪ వివరాలు అందించి ఆదర్శంగా నిలిచిన సర్పంచ్

**పదర, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత దేశ జనాభా, ఇండ్ల గణన కార్యక్రమం పదర మండలం ఇప్పలపల్లి గ్రామంలో ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాత్లావత్ గేమ నాయక్ తన నివాసానికి వచ్చిన ఎన్యుమరేటర్లకు తన కుటుంబ వివరాలను అందజేసి ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా ఎన్యుమరేటర్లకు సహకరించాలని కోరారు. మనం ఇచ్చే వివరాల ఆధారంగానే ప్రభుత్వం భవిష్యత్తు





సంక్షేమ పథకాలు, గ్రామ అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తుందని ఆయన వివరించారు. ఎన్యుమరేటర్లు ప్రజల సందేహాలను ఓపికతో నివృత్తి చేయాలని, గ్రామస్తులు కూడా ఎన్యుమరేటర్లకు వాస్తవ సమాచారాన్ని గోప్యత లేకుండా తెలియజేయాలని సూచించారు. జనాభా గణనలో పాల్గొనడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, దీనివల్ల ప్రభుత్వానికి సరైన గణాంకాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు రాజేశ్వర్, మునిలాల్‌తో పాటు గ్రామ పెద్దలు లాల్ సింగ్, సోమ్లా, లక్ష్మ, సామాజిక కార్యకర్త రామావత్ సేవ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ స్కామ్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ నాయక్



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీట్ పరీక్ష నిర్వహణలో ఘోరంగా విఫలమై, లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని ఎన్ఎస్‌యూఐ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ నాయక్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం అచ్చంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. లీకుల ప్రభుత్వం: గత పదేళ్ల కాలంలో ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడం ఇది 89వ సారని, ఇంత జరుగుతున్నా మోదీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. దేశవ్యాప్త పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని సంతోష్ నాయక్ డిమాండ్ చేశారు. "'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' అని ప్రగల్భాలు పలికే బీజేపీకి 'వన్ నేషన్ - వన్ ఎగ్జామ్' కూడా నిర్వహించే సామర్థ్యం లేదు. డబ్బున్న వారికే సీట్లు కేటాయించి, పేద విద్యార్థులకు అన్యాయం చేయడమే బీజేపీ విద్యా విధానమా?" అని ప్రశ్నించారు. "విద్యార్థుల కన్నీళ్లు, తల్లిదండ్రుల కష్టాలు ఈ ప్రభుత్వానికి శాపంగా మారుతాయి. స్కామ్ వెనుక ఉన్న అసలు దొంగలను కాపాడాలని చూస్తే దేశ యువత క్షమించదు." అని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ నాయక్ అన్నారు.

# భావి తరాలకు 'సంస్కార' వారధి!

ముగిసిన హిందూ బాల సంస్కార శిక్షణ శిబిరం



**జనగామ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బాల్యంలోనే ధర్మం పట్ల అవగాహన, దేశం పట్ల అంకితభావం, కుటుంబ విలువలపై పట్టు సాధించినప్పుడే సంస్కారవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక తత్వవేత్త డాక్టర్ మోహనకృష్ణ భార్గవ పేర్కొన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గత 12 రోజులుగా నిర్వహించిన "హిందూ బాల సంస్కార శిక్షణ" తరగతులు మంగళవారం రాత్రి 'సమారోప్' వేడుకలతో ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పౌరాణిక పాత్రల వేషధారణలో చిన్నారులు మెరిసిపోయారు. ఆధ్యాత్మిక, దేశభక్తి గీతాలు, ఆటపాటలతో దేవాలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించి, భారతీయ సంప్రదాయంలోని కుటుంబ విలువులను చాటిచెప్పారు. ఈ దృశ్యం చూసిన తల్లిదండ్రులు భావోద్వేగానికి లోనయ్యారు. హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా విద్యార్థులు, అతిథులు కలిసి నిర్వహించిన సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంతో ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంలో మునిగిపోయాయి. ఈ సందర్భంగా డా.మోహనకృష్ణ భార్గవ మాట్లాడుతూ.. పన్నెండు రోజుల శిక్షణలో భాగంగా విద్యార్థులకు వేద పురాణాలు, ఇతిహాసాలు, నైతిక విలువలు, జాతీయత మరియు మానసిక వికాసం వంటి 100కు పైగా అంశాలను బోధించినట్లు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో గొప్ప మార్పు, చైతన్యం వచ్చిందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ఈ ప్రయత్నం సఫలం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. శిక్షణలో పాల్గొన్న 115 మంది విద్యార్థులకు ముఖ్య అతిథులు ప్రశంసా పత్రాలు, హనుమాన్ చాలీసా పుస్తకాలు, పెన్నులు మరియు విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ విభాగ్ సంఘటన మంత్రి శివరాములు, దేవస్థాన గౌరవాధ్యక్షులు గజ్జెల నర్సిరెడ్డి, వీహెచ్పీ జిల్లా అధ్యక్షుడు ఎనగందుల బిక్షపతి, ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపీచంద్, ఆర్టీఏ మెంబర్ చిలువేరు అభిగౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమ సమన్వయకర్తలు మైలారం శ్రీనివాస్, చిలువేరు హర్షవర్ధన్, రాజు, లావణ్య, ప్రమోద్, బాలరాజు తదితరులు ఈ వేడుకను విజయవంతం చేశారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్ Voice of Vande Bharath

VOICE OF VANDE BHARATH

బుధవారం, మే 13, 2026

## తెలంగాణపై నిప్పుల వాన

- 45 డిగ్రీలు దాటనున్న ఉష్ణోగ్రతలు
- ఉత్తర తెలంగాణకు నేడు 'రెడ్ అలర్ట్'..
- మరోవైపు ఊరటనిచ్చే రుతుపవనాల కబురు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలుగు రాష్ట్రాల్లో ఎండలు ముదురుతున్నాయి. తెలంగాణలో రాబోయే రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు భారీగా పెరగనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. పలు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే ఉత్తర తెలంగాణ జిల్లాలకు నేడు వాతావరణ కేంద్రం 'రెడ్ అలర్ట్' జారీ చేసే అవకాశం ఉంది. ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఒక తీపి కబురు అందించింది. ఈ వారాంతంలోగా నైరుతి రుతుపవనాలు అండమాన్ తీరాన్ని తాకనున్నాయి. రుతుపవనాల కదలికకు బంగాళాఖాతంలో వాతావరణం అనుకూలంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. అండమాన్ తర్వాత మరో 10 రోజుల్లో రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉంది. తద్వారా దేశవ్యాప్తంగా వర్షకాలం ప్రారంభం కానుంది. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. ఇది మరికొన్ని గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో తీరప్రాంతాల్లో గాలులు వీస్తాయని అధికారులు వెల్లడించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు.

## యాదాద్రి తరహాలో శ్రీ కురుమూర్తి క్షేత్ర అభివృద్ధి

- ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి
- వైభవంగా నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం..
- హాజరైన ఎమ్మెల్యేలు జీఎంఆర్, రాజేష్ రెడ్డి



**చిన్న చింతకుంట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి పుణ్యక్షేత్రాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నూతన పాలకవర్గం అంకితభావంతో పనిచేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం శ్రీ కురుమూర్తి దేవస్థాన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా స్వామివారి ప్రధానాలయంలో అర్చకులు, దేవస్థాన అధికారులు నూతన



పాలకవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయ అధికారులు ఎమ్మెల్యేలను, నూతన సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కొండ దిగువన ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కురుమూర్తి స్వామి క్షేత్రానికి ఉన్న చారిత్రక ప్రాశస్త్యాన్ని కాపాడుతూ, భక్తులకు అన్ని రకాల వసతులు కల్పించి దీనిని గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో యాదాద్రి తరహాలో కురుమూర్తి క్షేత్రం కూడా అద్భుతమైన ప్రాచుర్యం పొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో నిధులు, సహకారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలి

- చల్మెడ లక్ష్మీనరసింహారావు
- వేములవాడ క్రీడాకారులకు 'కేసీఆర్ కప్' కిట్లు పంపిణీ
- రన్నరప్ జట్లకు భారీ నగదు బహుమతి



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్వహించిన 'కేసీఆర్ కప్' క్రికెట్ టోర్నమెంట్ ముగింపులో భాగంగా బుధవారం ఆయన పట్టణంలోని 14 జట్లకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన కీలక ప్రసంగం చేశారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న వేములవాడ పట్టణానికి చెందిన 14 జట్ల క్రీడాకారులకు వారి ప్రతిభను గుర్తించి కిట్లను అందజేశారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చాటేందుకు కేసీఆర్ కప్ ఒక గొప్ప వేదికగా నిలిచిందని చల్మెడ కొనియాడారు. జిల్లా స్థాయిలో రాణించి మొదటి రన్నరప్‌గా నిలిచిన తిప్పాపూర్ (7, 8 వార్డులు) 'వేములవాడ కమాండర్స్' జట్టుకు రూ. 1 లక్ష నగదు బహుమతిని చల్మెడ అందజేశారు. అలాగే, రెండో రన్నరప్‌గా నిలిచిన భగవంతరావునగర్ (26, 27 వార్డులు) 'వేములవాడ రాయల్స్' జట్టుకు రూ. 50 వేల ప్రోత్సాహక బహుమతిని స్వయంగా అందజేసి అభినందించారు. యువతను క్రీడల వైపు మళ్లించడంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎప్పుడూ ముందుంటారని చల్మెడ గుర్తు చేశారు. కేవలం క్రికెట్ మాత్రమే కాకుండా, భవిష్యత్తులో వేములవాడ నియోజకవర్గంలో కబడ్డీ, వాలీబాల్ వంటి టోర్నమెంట్లు నిర్వహించి గ్రామీణ క్రీడాకారులను వెలికితీస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, కొండ కనుకయ్య, సిరిగిరి చందు, గూడూరు మధు, సుంకపాక రాజు, పెద్దిరాజు, హనుమంతు, లైశెట్టి మల్లేశం, అంజద్ పాషా, మామిండ్ల కనకయ్య, మంత సందీప్, ఉమర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీకి కేంద్రమే బాధ్యత వహించాలి



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని కాంగ్రెస్ ఓబీసీ విభాగం జిల్లా కో-ఆర్డినేటర్ కల్లూరి పవన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వైద్య విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పవన్ మండిపడ్డారు. గతంలో కూడా నీట్ పేపర్ లీకేజీలు జరిగాయని, తద్వారా లక్షలాది మంది మెరిట్ విద్యార్థులు తీవ్ర మనోవేదనకు, ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేపదే వైఫల్యాలకు కారణమవుతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని నీరుగార్చుతున్న లీకేజీల వెనుక ఉన్న అసలు దోషులను శిక్షించి, బాధితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కల్లూరి పవన్ డిమాండ్ చేశారు.

## ఓఎస్‌డీ నియామకంపై వెనక్కి తగ్గిన సీఎం విజయ్

- జ్యోతిష్యుడు రాధన్ పండిట్ తొలగింపు

**చెన్నై, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఓఎస్‌డీ నియామక వివాదానికి సీఎం విజయ్ తెరదించారు. తన వ్యక్తిగత జ్యోతిష్యుడు రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను ముఖ్యమంత్రి ప్రత్యేక విధులాధికారిగా నియమిస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేసింది. అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నెగ్గిన వెంటనే ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంటూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. సీఎం విజయ్‌కు అత్యంత ఆప్తుడైన వెట్రివేల్ గతంలో జయలలిత వంటి దిగ్గజ నాయకులకు కూడా సలహాలు అందించారు. అయితే, ఒక జ్యోతిష్యుడిని ప్రభుత్వ అధికారిక హోదాలో నియమించడంపై విపక్షాలతో పాటు మిత్రపక్షాల నుండి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అసెంబ్లీలో బలపరీక్షకు ముందు మిత్రపక్షమైన వీసీకే ఎమ్మెల్యే వాణి అర్సు ఈ అంశాన్ని గట్టిగా లేవనెత్తారు. "ప్రభుత్వం మూఢనమ్మకాలకు తావు ఇవ్వకుండా, శాస్త్రీయ, తార్కిక ఆలోచనా ధోరణితో ముందుకు సాగాలి" అని అసెంబ్లీ వేదికగా విజ్ఞప్తి చేశారు. ఈ విమర్శలపై స్పందించిన సీఎం విజయ్, నియామకాన్ని పునఃసమీక్షిస్తామని సభలోనే ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం, బలపరీక్ష ముగియగానే నియామక ఉత్తర్వులను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. తమ ప్రభుత్వం 'లౌకిక', 'శాస్త్రీయ' విధానాలకు కట్టుబడి ఉంటుందని సీఎం విజయ్ ఈ నిర్ణయం ద్వారా సంకేతాలు పంపారు. టీవీకే విజయాన్ని ముందుగానే ఊహించిన వెట్రివేల్‌కు పదవి కట్టబెట్టడం ద్వారా విమర్శల పాలవ్వడం ఇష్టం లేకే సీఎం ఈ యూ-టర్న్ తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సఫలమయ్యారు.

## ఎయిర్ ఇండియా సంచలన నిర్ణయం

- ఆరు దేశాలకు విమాన సర్వీసులు నిలిపివేత
- జూన్ నుంచి ఆగస్టు వరకు తాత్కాలిక రద్దు

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా అంతర్జాతీయ ప్రయాణికులకు షాక్ ఇచ్చింది. ఇంధన ధరల పెరుగుదల మరియు గగనతల ఆంక్షల నేపథ్యంలో పలు కీలక దేశాలకు నడుపుతున్న విమాన సర్వీసులను తాత్కాలికంగా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా ఆరు ప్రధాన అంతర్జాతీయ మార్గాల్లో సర్వీసులను రద్దు చేస్తూ సంస్థ నిర్ణయం తీసుకుంది. ఎయిర్ ఇండియా వెల్లడించిన వివరాల ప్రకారం.. ఢిల్లీ – చికాగో, ముంబై – న్యూయార్క్, ఢిల్లీ – షాంఘై, చెన్నై – సింగపూర్, ముంబై – ఢాకా, ఢిల్లీ – మాలే (మాల్దీవులు) రూట్లలో జూన్ నుంచి ఆగస్టు వరకు విమానాలు నడవవు. అంతర్జాతీయంగా పెరుగుతున్న ఇంధన ధరలు మరియు వివిధ దేశాల మధ్య నెలకొన్న గగనతల ఆంక్షల వల్ల విమాన నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ నష్టాలను తగ్గించుకునే క్రమంలోనే సర్వీసుల కోత అనివార్యమైందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. మొత్తం మీద ఎయిర్ ఇండియా ప్రతి నెలా 1,200కు పైగా అంతర్జాతీయ సర్వీసులను కొనసాగించనుంది. ఉత్తర అమెరికా: వారానికి 33 విమానాలు, ఐరోపా: వారానికి 47 విమానాలు, యూకే: వారానికి 57 సర్వీసులు, ఆగ్నేయాసియా & సార్క్ దేశాలు: వారానికి 158 సర్వీసులు, ఆస్ట్రేలియా: వారానికి 8 విమానాలు, మారిషస్: వారానికి 7 సర్వీసులు నడిపాయి. ప్రస్తుతం సర్వీసులు రద్దు చేసిన మార్గాల్లో ప్రయాణించాలనుకునే వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని లేదా రీఫండ్ కోసం ఎయిర్ ఇండియా వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.